మత్స్యకారుల్లో అలజడి



భీమిలి తీరప్రాంతంలో నివసిస్తున్న మత్స్యకారుల్లో 'అల'జడి నెలకొంది. ఇక్కడి బీచ్‌రోడ్డు భారీగా కోతకు గురవుతుండటంతో పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. అలల వేగాన్ని నియంత్రించేందుకు అధికారులు శాశ్వత చర్యలు తీసుకోకపోవడంతో గంగపుత్రులు కలవరపడుతున్నారు. -భీమునిపట్నం

- కోతకు గురవుతున్న బీచ్‌రోడ్డు
- గతంలో కంటే పరిస్థితి మరింత ప్రమాదకరం
- తాత్కాలిక చర్యలతో నామమాత్రంగానే ఉపశమనం
- ఆందోళనలో మత్స్యకారులు



పడిపోయిన రక్షణ గోడ

ఇక్కడ బీచ్ పార్కు దగ్గర నుంచి మత్స్యకారులు నివసించే బోయివీధి ఆంజనేయ స్వామి విగ్రహం వరకు ఉన్న ప్రాంతం కొంత లోతట్టుగా ఉంటుంది. దీంతో ఆటుపోట్లు, తుపాన్ల సమయంలో అలలు ఉధృతంగా ముందుకు వస్తాయి. గతంలో ఇక్కడ రక్షణ గోడ ఉండడంతో అలలు ఎంత వేగంగా వచ్చినా పెద్దగా సమస్య ఉండేది కాదు. క్రమంగా గోడ దెబ్బ తింటూ వచ్చింది. ఆ పరిస్థితిలో అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో గోడ పూర్తిగా పడిపోయింది. ఇక అప్పటి నుంచి తీరం కోతకు గురవుతూ వస్తోంది. తుఫాన్ల సమయంలో అలలు రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి.

బిక్కుబిక్కుమంటూ జీవనం

ఇక్కడ ఆంజనేయస్వామి విగ్రహం పక్కనే బోయివీధి ప్రాంతానికి చెందిన ఒక భాగం ఉంది. ఇక్కడ 200 వరకు మత్స్యకార కుటుంబాలు ఉంటున్నాయి. తుఫాన్లు వచ్చిన సమయంలో అలలు ఉధృతంగా ముందుకు వస్తుండటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని జీవిస్తున్నారు.

తాత్కాలిక చర్యలతో సరి



గత ప్రభుత్వ హయాంలో రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. పనులు ప్రారంభమవుతాయన్న తరుణంలో ప్రభుత్వం మారిపోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా పనుల్లో కదలిక లేదు. ఇటీవల తీరం మరింత కోరుకుపోతుండటంతో అలలు ముందుకు రాకుండా అధికారులు తీరం వద్ద కొద్దిమేరకు తాత్కాలికంగా సిమెంట్ దిమ్మలను ఏర్పాటు చేశారు. కానీ దీనివల్ల పెద్దగా ప్రయోజనం లేకపోయింది. అలలు యథావిధిగా ముందుకు వస్తున్నాయి. త్వరితగతిన శాశ్వతచర్యలు చేపట్టకుంటే ఇక్కడి మత్స్యకార నివాసాలకు ముప్పు వాటిల్లనుంది.



ఇక్కడ ఎత్తయిన ప్రాంతంలోని రోడ్డు, పక్కన రక్షణ గోడ, మత్స్యకారుల నివాసాలు

గట్టు కింద కొట్టుకుపోతున్న మట్టి



ఇక్కడ ఆంజనేయ స్వామి విగ్రహం వరకు రోడ్డు లోతట్టుగా ఉండడం వల్ల సమస్య ఉంటోంది. అక్కడి నుంచి జిల్లా పరిషత్ అతిథి గృహం వరకు బోయివీధికి చెందిన మత్స్యకారుల నివాసాలు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఇక్కడ రోడ్డు ఎత్తుగా ఉండడంతో పాటు రక్షణ గోడ కూడా ఉండటంతో తుఫాన్లు వచ్చినా ఈ ప్రాంతానికి సమస్య ఉండేది కాదు. కానీ అలలు బాగా ముందుకు వస్తుండటంతో ఎత్తయిన గట్టు, గోడ వద్ద ఉన్న ప్రాంతం కోరుకుపోతోంది. రక్షణగోడ కింద భాగంలో మట్టి కొట్టుకుపోతుండటంతో గోడ కూలిపోయే పరిస్థితికి చేరుకుంది. అదే జరిగితే రోడ్డు పక్క పెద్ద ఎత్తున ఉన్న ఇళ్లు కూలిపోయే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పటిష్టమైన రక్షణ గోడ నిర్మించాలని మత్స్యకారులంతా విజ్ఞప్తి చేస్తున్నారు.

కంటిపై కునుకు కరువు



మా నివాసాల పక్కన తీరం భారీగా కోతకు గురవుతోంది. గట్టు కింద మట్టి బాగా కొట్టుకుపోయింది. అప్పుడప్పుడు అలలు రోడ్డు మీదకు వచ్చేస్తున్నాయి. ఇలాగే కొనసాగితే అలలు మా ఇళ్లపైకి వచ్చేస్తాయని భయపడుతున్నాం. దీంతో తుపాన్లు వచ్చినప్పుడల్లా కంటిపై కునుకు ఉండదు. అధికారులు గట్టి గోడ కట్టాలి. అప్పుడే మాకు రక్షణ ఉంటుంది.

-బుగత రమణ, మత్స్యకారుడు, భీమిలి

రాళ్లు వేసినా అలలు వచ్చేస్తున్నాయి



తీరం కోతకు గురవుతుందని అలలను కట్టడి చేయడానికి అధికా రులు బండరాళ్లు వేయించారు. వాటిలో చాలా కొట్టుకుపోయాయి. అలలు ఉధృతంగా తీరాన్ని తాకుతున్నా యి. ఇలానే ఉంటే పెద్ద ముప్పు తప్పదు.

-నొల్లి కృష్ణవేణి, మత్స్యకార మహిళ, భీమిలి

ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి



ఇక్కడ మత్స్యకారులు నివాస ముండే తీరప్రాంతం పెద్ద ఎత్తున కోతకు గురవుతోంది. ఇదిలాగే కొనసాగితే తుఫాన్లు వచ్చినప్పుడు మత్స్యకారుల నివాసాలు పెను ప్రమాదానికి గురవు తాయి. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. శాశ్వత చర్యలు తీసుకోవాలి.

- కదిరి ఎల్లాజీ, మత్స్యకారుల నాయకుడు

క్లుప్తంగా

ప్రైవేట్ ఆస్పత్రుల సహకారం అవసరం



ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

కొమ్మాది: రాష్ట్ర ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించి, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడంలో ప్రైవేటు ఆస్పత్రుల సహకారం అవసరమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. గీతం ఆస్పత్రిలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన 40 పడకల ఎమర్జెన్సీ విభాగాన్ని, ఆపరేషన్ థియేటర్ల సముదాయాన్ని ఎంపీ శ్రీ భరత్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. పేద ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించడానికి మానవతా దృక్పథంతో గీతం ఆస్పత్రి విభాగాలు అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు, పెన్సిల్ బాక్స్‌లతో విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని బ్యాంక్ కాలనీ, దెక్కతిపాలెం, మామిడిపాలెం గ్రామాల్లో పేద విద్యార్థులకు గ్రేస్ హ్యాపీనెస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నోట్ పుస్తకాలు, పెన్సిల్ బాక్సులు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకుడు పోతుల నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బబ్బేలమ్మ ఒడ్డు పండగ



అమ్మవారికి సారె తీసుకువెళ్తున్న మహిళలు

పీఎం పాలెం: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న కారుషెడ్ బబ్బేలమ్మ వారి ఒడ్డు పండుగను పీఎం పాలెం పరిధి లక్ష్మీవానిపాలెం గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.

ఘనంగా ముత్యాలమ్మ ఉత్సవం



ఆశీర్వాదం కోసం పూజారిని చిన్నపిల్లలపై నుంచి దాటిస్తున్న తల్లిదండ్రులు

పద్మనాభం: మద్ది గ్రామంలో ముత్యాలమ్మ ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ప్రతిమలను జంగిడిలో ఉంచి, గ్రామంలో నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. దీనిలో భాగంగా తల్లి దండ్రులు తమ చిన్న పిల్లలను రోడ్డు మీద ఉంచి, వీరిపై నుంచి పూజారి కనకల అచ్చన్నను దాటించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, భక్తులు పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమ చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో చిడతలు, కోలాటం ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లతో డిగ్రీ కళాశాల విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి మంగళవారం అందజేశారు. ఇటీవల కళాశాలలో నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు డేటాప్రో కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించింది. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ అంశాలపై ఈ ఏడాది మే 5 నుంచి జూన్ 28 వరకు విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు



కాయగూరలు, పువ్వుల అలంకరణలో రాస పోలమాంబ



మొక్కజొన్న కంకుల అలంకరణలో తోగాలమ్మ



పైనాపిల్, నిమ్మకాయల అలంకరణలో ముత్యాలమ్మ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాసపోలమాంబ అమ్మవారు మంగళవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి 113వ అలంకరణలో భాగంగా ముల్లంగి, క్యారెట్, బెండకాయలు, తులసిమాలలు, జర్బరా పువ్వులతో అలంకరించారు. శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన గుడ్డాల అప్పలరాజు, లక్ష్మీదుర్గ, రామకృష్ణ, ఉమ అమ్మవారి అలంకరణకు సహాయ సహకారాలు అందించారు.

- చిప్పాడ దివీస్ లేబొరేటరీ రోడ్డులోని మద్దిపేటకు చెందిన గుడివాడ గ్రామదేవత తోగాలమ్మను మొక్కజొన్న కంకులు, ముత్యాలమ్మను పైనాపిల్, నిమ్మకాయలతో అలంకరించారు. ఆలయ కమిటీల ప్రతినిధులు ఈ ప్రత్యేక అలంకరణలు చేయించారు. అమ్మవార్లను చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

709కి చేరిన కార్మికుల దరఖాస్తులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో యాజమాన్యం నుంచి రావలసిన బకాయిల కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికుల సంఖ్య మంగళవారం నాటికి 709కి చేరుకుంది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో కార్మికసంఘాలు, కార్మిక శాఖ, మిల్లు యాజమాన్యం మధ్య ఇటీవల జరిగిన చర్చల ప్రకారం చెల్లింపులు చేయనుంది. ఇందులో యాజమాన్యం ఈ నెల 2 నుంచి 20 వరకు చివరి దఫా దరఖాస్తులు స్వీకరించి పీఎఫ్, గ్రాట్యుటీ, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెన్షన్, క్వార్టర్స్ ఖాళీ చేసిన కార్మికులకు రావలసిన రూ.1000, చనిపోయిన కార్మికుల భార్యలకు రావలసిన రూ.5వేలు వంటి బకాయిల సమస్యలు పరిష్కరించనుంది. చిట్టివలస జ్యూట్‌మిల్లు అక్రమ లాకౌట్ బాధితుల సంఘం తరపున ప్రముఖ న్యాయవాది ఎస్.జనార్ధనరావు మాట్లాడుతూ కార్మికులకు రావలసిన బకాయి వేతనాల చెల్లింపునకు చట్టప్రకారం గడువు అంటూ ఏమీ ఉండదని తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



కుట్టుశిక్షణ కేంద్రాల నిర్వాహకులను సత్కరిస్తున్న అక్షయశక్తి ప్రతినిధులు

తగరపువలస: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాట్ల వెంకట అప్పల ప్రసాదరాజు ఆకాంక్షించారు. ముంబయికి చెందిన అక్షయశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హర్‌స్కో ఎన్విరాన్‌మెంట్ సౌజన్యంతో మజ్జివలస, లక్ష్మీపురం, విజయానందపురంలో 90 మంది మహిళలకు 2 నెలల పాటు నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి గతంలో వైఎస్సార్, తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. అక్షయశక్తి వెల్ఫేర్ అసోసియేషన్, హర్‌స్కో ప్రతినిధులు మాట్లాడుతూ కుట్టు శిక్షణ పూర్తి చేసుకుని, ఉపాధి ఏర్పాటు చేసుకునే మహిళలకు దేశవ్యాప్తంగా మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ మూడు కేంద్రాల్లో కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలకు ఇప్పటి వరకు 30 కుట్టుమిషన్లు ఉచితంగా అందించామని, త్వరలో మరో 70 మిషన్లు అందిస్తామని చెప్పారు. భవిష్యత్తులో కుట్టుశిక్షణతో పాటు ఇతర వృత్తిపనులకు అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. ఈ సందర్భంగా మహిళలు తయారుచేసిన వస్త్రాలను ప్రదర్శించారు. వారికి సర్టిఫికెట్లు అందించి, శిక్షణ ఇచ్చిన నిపుణులను సత్కరించారు. కార్యక్రమంలో భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్‌లు తుపాకుల ఆదిలక్ష్మి, లచ్చుబుగత జగదీశ్వరరావు, తుపాకుల అప్పలరాజు, కరుభుక్త అప్పల నారాయణ, ఉప సర్పంచ్ బమ్మిడి అప్పన్న, పూసర్ల రాములప్పడు, హర్‌స్కో హెచ్ఆర్ మేనేజర్ పురుషోత్తం, ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్ రవికుమార్, అక్షయశక్తి ముంబై ప్రతినిధులు కిరణ్, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన కాలనీవాసుల పోరాటం

పార్కులో ఆక్రమణల తొలగింపు



బింద్రానగర్ పార్కులో ఆక్రమణలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు బింద్రానగర్ పార్కులో ఆక్రమణలను ఎట్టకేలకు జీవీఎంసీ అధికారులు మంగళవారం తొలగించారు. ఏసీపీ తిరుపతి రావు ఆధ్వర్యంలో సిబ్బంది అనధికార షెడ్‌లను పొక్లెయిన్‌తో కూలగొట్టారు. వివరాలివి.. షిప్‌యార్డ్ లే అవుట్ బింద్రానగర్ పార్కులోని కొంతభాగంలో సదరు స్థలం తనదంటూ ఓ వ్యక్తి రెండు షెడ్లు నిర్మించాడు. దానికి విద్యుత్ శాఖ కరెంట్ కనెక్షన్ కూడా ఇచ్చింది. ఈ వ్యవహారంలో కాలనీ అసోసియేషన్‌కు, ఆ వ్యక్తికి మధ్య కొంతకాలం న్యాయ పోరాటం సాగింది. చివరకు అది పార్కు స్థలమే అని కోర్టు, ఉన్నతాధికారులు నిర్ధారించినా, ఆక్రమణ తొలగింపులో జోనల్ అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో కాలనీ అసోసియేషన్ సభ్యులు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశంతో జీవీఎంసీ అధికారులు మంగళవారం ఆ షెడ్లకు ఉన్న కరెంట్ కనెక్షన్ తొలగించి, రెండు షెడ్లు తొలగించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

నైపుణ్య వృద్ధితో స్వయం ఉపాధి



ధ్రువపత్రాలతో యువతులు

భీమునిపట్నం: నైపుణ్య వృద్ధితో స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ అన్నారు. ఈ కోర్సులు అభ్యసించడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. బ్యూటీషియన్ కోర్సును అభ్యసించిన 28 మందికి కళాశాల వద్ద మంగళవారం ధ్రువపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి కోర్సుల వల్ల మంచి ఆదాయం వస్తుందన్నారు. వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ ఎస్.అన్నపూర్ణ పాల్గొన్నారు.

పెద్దలను వదిలి పేదలపై పోలీసుల ప్రతాపం

చిరు వ్యాపారులకు పెనాల్టీలు



మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో రోడ్డు పక్క చిరు వ్యాపారులపై పెట్టీ కేసులు రాస్తున్న ఎస్ఐ

మధురవాడ: పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు పెద్దలను వదిలి రోడ్డు పక్క సాయంత్రం పూట చిరు వ్యాపారులు చేసుకుంటున్న వారిపై తమ ప్రతాపం ప్రదర్శిస్తున్నారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో చిరు వ్యాపారుల వివరాలు సేకరిస్తూ పెట్టీ కేసులు విధిస్తామంటూ ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్, ఇతర సిబ్బంది మంగళవారం సాయంత్రం హడలెత్తించారు. దీంతో వ్యాపారులు ఎప్పుడూ లేని కొత్త పద్ధతుల్లో కేసులు రాస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వీరు రోడ్డు పక్క ప్రైవేటు స్థలాల్లో ఉన్నవారికి పెనాల్టీలు విధించడం విశేషం. ఈ రోడ్డులోనే హైవే మొదలు గాంధీ విగ్రహం వరకు పదుల సంఖ్యలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, బ్రాందీ షాపులు, హోటల్స్, బార్లు ఉన్నాయి. వాటిలో అధిక భవనాలకు సెల్లార్ పార్కింగ్ లేదు. బడా వ్యాపారులు, నోరున్న, రాజకీయ పలుకుబడి ఉన్న నాయకులే ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో పాటు వాటిపైనే దుకాణాలు ఏర్పాటు చేసి, నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. కానీ వారిపై చర్యలు చేపట్టి ఆక్రమణలు తొలగించాలి. కానీ ఆ దిశగా చర్యలేవీ లేకపోవడం గమనార్హం.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

పీఎం పాలెం: స్థానిక ట్రాఫిక్ పోలీసులు మంగళవారం సాయంత్రం హైవేపై ప్రయాణించే వాహనాల తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి, భారీ జరిమానా విధిస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక రేపు

పద్మనాభం: పద్మనాభం సెక్షన్ కార్యాలయంలో గురువారం ఉదయం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు వేదిక చైర్మన్, రిటైర్డ్ జడ్జి బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ తదితర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1912 కు సంప్రదించవచ్చని సూచించారు.

నేడు కోదండ రామాలయ వార్షికోత్సవం

పద్మనాభం: మండలంలోని వెంకటాపురంలో కోదండ రామస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డు పరిధి పీఎం పాలెంలో సుమారు రూ.1.77 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.44 లక్షలతో ఉత్కర్ష అపార్ట్‌మెంట్ నుంచి నవోదయ డబుల్ రోడ్డు వరకు బీటీ రోడ్డు, రూ.34 లక్షలతో బక్కన్నపాలెం బ్రైట్ బడ్డీస్ స్కూల్ నుంచి దివ్యాంగుల ఐటీ వరకూ డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మిస్తామన్నారు. మిగిలిన రూ. 99.78 లక్షలతో డీఆర్‌కే రాజు లే అవుట్ సమీపంలో కల్వర్టు, కొమ్మాది వాటర్ పాండ్ వద్ద వాకింగ్ ట్రాక్ , రెయిలింగ్ పచ్చదనం పెంపునకు అవసరమైన వసతుల కల్పన, చిల్డ్రన్స్ ప్లే ఏరియా అభివృద్ధి, జిమ్ పరికరాల ఏర్పాటుతో పాటు కేకే ఫంక్షన్ హాల్ నుంచి సిల్వర్ స్క్వేర్ అపార్ట్‌మెంట్ వరకు సీసీ రోడ్డు నిర్మిస్తామని తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో చంద్రంపాలెం విద్యార్థులకు పతకాలు



విజేతలను అభినందిస్తున్న హెచ్ఎం వెంకటరావు తదితరులు

మధురవాడ: రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ క్రీడాకారులు 3 బంగారు, 3 వెండి పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో తిరుపతిలో అండర్-14, అండర్-17 సంవత్సరాలు బాలుర రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన పి.రవి, ఎల్.పవన్‌కుమార్, టి.నరేంద్ర స్వర్ణ పతకాలు, వై.సాయికుమార్, కె.పవన్, కె.దీపక్ రజత పతకాలు సాధించారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరావు, పాఠశాల కమిటీ చైర్మన్ అచ్యుతరావు తదితరులు విజేతలను అభినందించారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

పద్మనాభం: ఆయిల్‌పామ్ సాగు చేయడం లాభదాయకమని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.శ్యామల అన్నారు. మండలంలోని గెద్దపేటలో పూర్ణచంద్రరావు నాదెళ్ల భూమిలో మంగళవారం ఆయిల్‌పామ్ తోటల మెగా మేళా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్ఎంఈఈ పథకం కింద ఎకరాకు 50 ఆయిల్‌పామ్ మొక్కలు ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. ఏపీఎం ఐపీ పీడీ కె.మన్మథరావు., భీమిలి ఉద్యానవనశాఖ అధికారిణి భాను పుష్ప, మాజీ జెడ్పీటీసీ కె.దామోదరరావు, కె.రమణ పాల్గొన్నారు.